05ATP27.qxd:05ATP27.qxd 02/10/22 11:14 PM Page 1



# ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పేరు మార్పు కుట్రపూరితం...

## - వైకాపా ప్రభుత్వ తీరుపై రిలే నిరాహారదీక్షలకు టిడిపి శ్రీకారం



రిలేదీక్షలు చేపట్టిన టిడిపి శ్రేణులు.

**గుంతకల్లు, అక్టోబర్ 01 ప్రభాతవార్త**

రాష్ట్రంలో తలమానికంగా ఉన్న "ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయం "పేరును మార్పుచేస్తూ తీసుకున్న వైకాపా ప్రభుత్వ నిర్ణయం కేవలం కుట్రపూరితమని స్థానిక టిడిపి శ్రేణులు పేర్కొన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ ఆదేశాల మేరకు స్థానిక గుంతకల్లు పురపాలక సంఘం కార్యాలయం సమీపంలో టిడిపి శ్రేణులు రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా విశేష మన్ననలను పొందుతున్న ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయం పేరును ప్రస్తుత వైకాపా ప్రభుత్వ నిరంకుశపాలనకు తోడుగా వైఎస్ఆర్ వైద్య విశ్వవిద్యాలయంగా మార్చడం రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి నేతృత్వంలోని వైకాపా ప్రభుత్వంకు తగదని, ఇది కేవలం కుట్రపూరిత పాలనకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. ఇలా విద్యాలయాలు, వివిధ పథకాల పేర్లను మార్చుకుంటూ పాలన సాగిస్తున్న వైకాపా ప్రభుత్వ పాలకుల తీరు పట్ల ప్రజలు విస్తుపోతున్నారని, వారి చర్యల పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారన్న సత్యాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైకాపా పార్టీ పేరులో కూడా ప్రజలను మభ్యపెట్టే తీరుందన్న సత్యాన్ని గుర్తించాలని, యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ అంటూ రిజిష్టరు చేయించుకుని ప్రజలకు మాత్రం తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరుతో పార్టీ ఉందని మభ్యపెడుతున్న తీరు మోసపూరితం కాదా అని ఆ పార్టీ శ్రేణులు గుర్తించాలన్నారు. తన తండ్రి పేరుగా చూపుతూ ప్రభుత్వ రికార్డుల్లో వేరుగా రిజిష్టర్ చేయించి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న ఘనత జగన్‌రెడ్డికే చెందుతుందన్నారు. ఇలాంటి మోసాలు, కుట్రలు జగన్‌రెడ్డి పాలనలో సర్వసాధారణంగా మారిందని, రాబోవు రోజుల్లో ప్రజలు బుద్ధిచెప్పి రాష్ట్రం నుండి తరిమికొట్టే రోజులు దగ్గర పడుతుందన్న సత్యాన్ని గుర్తించాలని వైకాపా శ్రేణులకు హితవు చెప్పారు. వైఎస్ఆర్ అంటే దివంగతనేత రాజశేఖరరెడ్డిగా గుర్తించాలా లేక పార్టీ పేరులో ఉన్న యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీగా గుర్తించాలా ప్రప్రథమంగా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇలా వైఎస్ఆర్ పేరు మార్పుతో చర్యలు చేపట్టడం సదరు వైకాపా ప్రభుత్వంకు తగదని, ఆ దివంగత టిడిపి వ్యవస్థాపకుడు మహానేత స్వర్గీయ ఎన్టీఆర్ పేరును కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని జోశ్యం చెప్పారు. దీక్షల్లో పాల్గొన్న వారిలో పవన్‌కుమార్‌గౌడ్, గుమ్మనూరు వెంకటేష్,తలారి మస్తానప్ప, కేశవ్, మధురాయల్, నందీశ్వర్,ఫ్రూట్‌మస్తాన్,బి.రాము, వండన్న,గిడ్డయ్య,కురుబ నరేష్, చిన్నఒబన్న, ఈశ్వర్, మీటునాయక్,రాముడునాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షాపరులు మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.శీనాథ్‌గౌడ్, ఆమ్మెటమస్తాన్‌యాదవ్,పానుమంతు,బండారు రామన్నచౌదరి,షేక్‌ఖలు, లక్ష్మయ్యయాదవ్ తదితరులు సంఘీభావం ప్రకటించారు.

# విశేష పుష్పాలంకరణలో శ్రీ వాసవాంబ

## - ప్రత్యేక అలంకరణలో శ్రీ అత్తివరదరాజ పెరుమాళ్ స్వామి వారు - భక్తులతో కిటకిటలాడిన వివిధ ప్రముఖ దేవాలయాలు





విశేష పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన మూలవరులు శ్రీ వాసవాంబ ,శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో 6వరోజు విశేష అలంకరణలో శ్రీ అత్తివరదరాజ పెరుమాళ్.

**గుంతకల్లు, అక్టోబర్ 01 ప్రభాతవార్త**

పట్టణంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని 6వ రోజు శుక్రవారం పలు దేవాలయాలలో ఆయా దేవస్థానాలలో ఆలయకమిటీ సభ్యుల నేతృత్వంలో ఆలయాల అర్చక బృందం ఆధ్వర్యంలో సాంప్రదాయ పద్ధతిన ఆయా ఆలయాలలోని మూలవరులను వైధికంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మూలవరులను విశేష అలంకరణ గావించి ప్రత్యేకపూజలు నిర్వహించగా భక్తులు నేత్రానందకరంగా దర్శించుకున్నారు. పట్టణంలోని ప్రముఖ దేవాలయమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులలో 6వ రోజును పురస్కరించుకుని విశేష అభిషేకాలతో మూలవరులు శ్రీవాసవాంబను విశేష పుష్పాలంకరణ గావించి ప్రత్యేక పూజల నిర్వహణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈక్రమంలో ఉదయం ఆలయంలో ఆవాహిత దేవతా పూజలతో పాటు సుందరకాండ,దేవీ సప్తశతి, దేవీ భాగవతము, శ్రీలక్ష్మీనారాయణ హృదయ పారాయణములు, శ్రీచక్ర పూజాదులు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చనలు, సూర్య నమస్కారములు తదితర పూజా కార్యక్రమాలను వైధికంగా నిర్వహించారు. తదుపరి మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం గావించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని దేవస్థానంలోని శ్రీ నగరేశ్వరస్వామి, పార్వతీదేవి, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వార్ల ఉప ఆలయాలలో మూలవరులకు వైధికంగా అభిషేకాలుతోపాటు ప్రత్యేక అలంకరణలతో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలను నిర్వహించగా భక్తులు ఆయా కార్యక్రమాలను తిలకిస్తూ శ్రీవార్లను దర్శించుకున్నారు. ఈక్రమంలోనే సాయంత్రం ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తి ఏర్పాటులో శ్రీ అత్తివరదరాజ పెరుమాళ్ స్వామి వారిని విశేష పుష్పముల అలంకరణలో అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతూ భక్తులకు నేత్రానందకరం కల్పిస్తూ విశేష పూజలను చేపట్టారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా ఏకకాలంలో జరుగు సామూహికంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణము గావించి తదుపరి శ్రీకస్తూరిబాగాంధీ శ్రీ ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులచే నాట్యప్రదర్శన కార్యక్రమాలు చేపట్టగా సదరుకార్యక్రమాలు భక్తాదులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం,అనుబంధ సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి దర్శన ప్రత్యేక ఏర్పాట్లతో పాటు హాజరైన భక్తాదులకు ఉచితంగా ప్రసాదాలను వితరణ చేపట్టారు. అలాగే పట్టణంలోని శ్రీ ఉమామహేశ్వర ఆశ్రమంలో ఉమామహేశ్వరీ శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఉదయం,సాయంత్రం వేళల్లో శ్రీ గాయత్రీదేవి కుంకుమార్చనలతో పాటు రుద్రాభిషేకం,శ్రీగురు పూజ,శివకవచ పారాయణము తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

# శ్రీ మలయప్ప సన్నిధిలో... ఉదయం " గజమాల సేవ " - సాయంత్రం " గరుడోత్సవం సేవ "...



శ్రీ మలయప్ప సన్నిధిలో " గజమాల సేవ " పూజల దృశ్యము

**గుంతకల్లు, అక్టోబర్ 01 ప్రభాతవార్త**

పట్టణంలోని రాజేంద్రనగర్ ప్రాంతంలో నిర్మితమైన కలియుగ వైకుంఠధాముడైన శ్రీ మలయప్పస్వామి ( శ్రీ వేంకటేశ్వరస్వామి ) వారి సన్నిధిలో శ్రీ దేవీ నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని " గజమాల సేవ " ప్రాకారోత్సవము, " సుదర్శన హోమము " పూజలతో పాటు సాయంత్రం " గరుడోత్సవ ప్రాకారోత్సవ సేవ " తదితర కార్యక్రమాలను వైధికంగా చేపట్టారు. స్థానిక దేవస్థానంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతి తిరుమల దేవస్థానంలో జరుగు దసరా శరన్నవ బ్రహ్మోత్సవాల రీతిన శ్రీవారి సేవా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. ఈక్రమంలోనే శుక్రవారం శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా 6వరోజు దేవస్థానం కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక వేదపండితుల బృందం గర్భాలయంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ( శ్రీ మలయప్పస్వామి - శ్రీ శ్రీనివాసుడు), శ్రీగోదాదేవి, శ్రీపద్మావతిదేవి మూలవరులకు విశేష జలాభిషేకాలతో విశేషంగా వివిధ ఆభరణములతో పాటు పుష్పాలంకరణతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. తదుపరి కార్యక్రమంలో భాగంగా ఉదయం శ్రీవారికి ప్రత్యేకంగా గజమాల సేవగా దేవస్థానం పరిధిలో ప్రాకారోత్సవముతో పాటు దేవాలయ ప్రాంగణంలో సుదర్శనహోమము తదితర ప్రత్యేక పూజలను నిర్వహించగా సాయంత్రం శ్రీవారి గరుడోత్సవ ప్రాకారోత్సవ సేవ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సదరు కార్యక్రమాలను విశేషంగా భక్తాదులు పాల్గొని శ్రీవారి బ్రహ్మోత్సవ కార్యక్రమాల సేవా కార్యక్రమాలలో పాల్గొని శ్రీవారి మూలవరులను నేత్రానందకరంగా దర్శించుకుని తమతమ మొక్కులను తీర్చుకున్నారు.



విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన కలియుగ వైకుంఠధాముడు మూలవరులు శ్రీ మలయప్పస్వామి వారు



◄ శ్రీవారి గరుడోత్సవం దృశ్యం

# కసాపురంలో శ్రీ కాశీవిశాలక్షి, శ్రీకాశీవిశ్వేశ్వరులకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కాశీవిశాలక్షి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరులు.

**గుంతకల్లు, అక్టోబర్ 01 ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ కాశీవిశాలాక్షి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో శుక్రవారం శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు 6వరోజుకు చేరాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ఆలయ అర్చకబృందం, వేదపండితులు సంయుక్తంగా దేవస్థానం అనుబంద ఆలయమైన శ్రీ కాశీవిశాలాక్షి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలోని శ్రీవార్ల మూలవరులకు విశేష అభిషేకాల అనంతరం అమ్మవారికి విశేష ఆరాధన,లలిత సహస్రనామ త్రిశతి ఖడ్గమాల అష్టోత్తర శతనామావళి కుంకుమార్చనలుతో పాటు మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజాకార్యక్రమాలను వైధికంగా నిర్వహించారు. తదుపరి సాయంత్రం కార్యక్రమాలలో భాగంగా కుమారి శ్రీ సుహాసిని పూజతో పాటు అర్చన తదితర పూజా కార్యక్రమాలను విశేషంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామంలోని భక్తాదులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తూ బాణాసంచా విక్రయాలు కొనసాగించాలి

## -వ్యాపారులతో సమావేశంలో తహాశీల్దార్ ఎస్.బ్రమ్మయ్య

**ఉరవకొండ, అక్టోబర్ 1 ప్రభాతవార్త**

నిబంధనలు పాటిస్తూ బాణాసంచా విక్రయాలు కొనసాగించాలని తహాశీల్దార్ ఎస్.బ్రమ్మయ్య సూచించారు. పట్టణంలోని స్థానిక మండల తహాశీల్దార్ కార్యాలయంలో శనివారం బాణాసంచా లైసెన్సుదారులైన వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. దుకాణాలవద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, రేకులతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ వి.హరినాథ్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సి.ఎర్రిస్వామిరెడ్డి, ఏడీఎఫ్ఓ నాగలింగయ్య, ఆర్ఐ చంద్రశేఖర్, విద్యుత్‌శాఖ సిబ్బంది, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహాశీల్దార్ ఎస్.బ్రమ్మయ్య

# పురుగుల మందు సేవించి యువరైతు మృతి



మృతి చెందిన యువరైతు మహేష్

**కొత్తచెరువు, అక్టోబర్ 01, ప్రభాతవార్త**

మండల పరిధిలోని లోచర్ల గ్రామానికి చెందిన కటికెల మహేష్(30) అనే యువరైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు, శుక్రవారం మధ్యాహ్నం తన పొలంలోనే మిరప చెట్లకు కొట్టడానికి తెచ్చుకున్న పురుగుల మందు సేవిస్తుండగా గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టు ప్రక్కల వారు అతనిని నిలువరించే ప్రయత్నం చేశారు. అప్పటికే అతను పురుగుల మందు సేవించి ఉండడంతో తనే ద్విచక్రవాహనంలో మండల కేంద్రమైన కొత్తచెరువు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళగా అక్కడ సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి వెంటనే అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్ళాలని సూచించారు. దీంతో అతనిని హుటాహుటిన అనంతపురంకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. కాగా మృతుని తండ్రి కిష్టప్ప గతంలో మరణించగా తల్లీ నాగేంద్రమ్మ వద్దనే ఉంటూ వారికి చెందిన ఆరు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో సాగు చేసిన పంటలు నష్టపోవడమేకాకుండా పెట్టుబడులు విపరీతంగా పెరిగి పోవడంతో అరకొరగా పండి పంటలకు సరైన గిట్టుబాటులేక దాదాపు 10 లక్షల వరకు అప్పలు చేసినట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.ఎం.లింగన్న తెలిపారు. కాగా మృతుని సోదరుడు భారత సైన్యంలో జవానుగా పని చేస్తుండగా, ఇంటి వద్ద ఆలనాపాలనా చూసుకుంటున్న రెండవ కుమారుడు ఇలా ఆత్మహత్య చేసుకొని విగతజీవిగా మారడంతో తల్లి నాగేంద్రమ్మ భోరున విలిపించడం పలువురి హృదయాలను కలచివేసింది. ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# వీఎస్‌కే యూనివర్సిటీలో మోదీ సాధన పుస్తకం ఆవిష్కరణ



మోదీపై శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వారు వెలువరించిన మోదీ అట్ 20 పుస్తక ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి

**బళ్లారి, అక్టోబర్01, ప్రభాతవార్త ;**

బళ్లారిలోని విజయనగర శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో శుక్రవారంనాడు ప్రధాని మోదీ 20 సంవత్సరాల సాధనపై ముద్రించిన విశేష గ్రంథాన్ని స్థానిక ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. వీఎస్‌కే యూనివర్సిటీ ఆధ్వర్యంలో 20 మంది వ్యాసకర్తలు రచించిన ప్రధాని నరేంద్రమోదీ 20 సంవత్సరాల సాధనపై ప్రత్యేక పుస్తకాన్ని ముద్రించి విడుదల చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీఎస్‌కే యూనివర్సిటీ వారు ప్రజ్ఞావంతుల గురించి దేశానికి ఎనలేని సేవలు చేస్తున్న మహావ్యక్తుల గురించి పుస్తకాలు ముద్రించి సార్వజనికులకు విడుదల చేస్తుండడం గర్వించదగ్గ విషయమని, ప్రధాని నరేంద్రమోదీ దేశానికి, దేశ ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రతిఒక్కరు తెలుసుకునేందుకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగ పడుతుందని, నేడు ప్రపంచ దేశాలన్నీ భారతదేశంవైపు చూస్తున్నాయని, నరేంద్రమోదీ పాలన పట్ల ప్రశంసలు కురిపిస్తున్నారని, దేశం సుభిక్షంగా ఉంటున్నదంటే అది నరేంద్రమోదీ తీసుకొచ్చిన విప్లవాత్మకమైన చర్యలేనని తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు గోనాళ్ మురహరగౌడ, ఎంపీ వై.దేవేంద్రప్ప, ఎమ్మెల్సీ సతీష్, ఆర్థిక నిపుణుడు విశ్వనాథ్‌భట్, యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సిద్దుఅలగూరు, గాలిశంకరప్ప, అడవిస్వామి, జైప్రకాష్‌గౌడ, జె.వి.సుబ్బారావు, కర్ణాటక టెక్స్‌టైల్ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు జి.విరుపాక్షిగౌడ, వీరశేకర్‌రెడ్డి, శ్రీనివాస్‌మోత్కర్, మల్లన్న, చేతనహేమన్న, శివశంకర్‌రెడ్డి, బుడా అధ్యక్షుడు మారుతీప్రసాద్, ఏపీఎంసీ అధ్యక్షుడు యు.బసవలింగప్ప, బీజేపీ మీడియా సహసంచాలకుడు రాజీవ్‌తొగరి తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి అలంకరణలో ఆకట్టుకున్న సన్నదుర్గమ్మ



మహాలక్ష్మి అలంకరణలో భక్తుల్ని ఆకట్టుకున్న సన్నదుర్గమ్మదేవి

**బళ్లారి, అక్టోబర్01, ప్రభాతవార్త ;**

నగరంలోని సన్నదుర్గమ్మ దేవస్థానంలో శనివారంనాడు దేవీ నవరాత్రుల సందర్భంగా దేవస్థానంలో దేవీ విగ్రహానికి మహాలక్ష్మిదేవి అలంకరణ చేశారు. తెల్లవారుజామున దేవికి అభిషేకం, విశేష పూజ, దుర్గా హోమం జరిగింది. ఎప్పటిలా భక్తులు హాజరై దేవీ దర్శనం పొందారు. సాయంత్రం 6;30 గంటలకు ప్రకాష్‌హెమ్మాడీ బృందంచే ఇంద్రజాల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఆదివారంనాడు విశేషంగా పిల్లలకు అక్షరాభ్యాసం కొరకు సరస్వతిపూజ, ఉదయం 7 గంటల నుంచి జరుగుతుందని దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు మీనళ్లి తాయన్న తెలిపారు.

# వృద్ధాప్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి జాగ్రత్తలు అవసరం

## -ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌యండి.షఫీ



వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, అక్టోబర్ 1 ప్రభాతవార్త**

వృద్ధాప్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని ఉరవకొండ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌యండి.షఫీ పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని శ్రీ విఠల్ రుక్మిణీ విజయ వృద్ధ అనాదాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు ఆరోగ్య సూత్రాలను బోధించిన అనంతరం ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌యండి.షఫీ మాట్లాడుతూ రసాయన వాజీకరణ ఔషదాలను, తులసి, అశ్వగంధ, శతావరి, రావి ఆకులు, కషాయం, బిల్వ ఆకుల కషాయం, కురగాయలు, పండ్లు, గింజలు, వ్యాధి నిరోధక శక్తికి ఓజోవర్ధక క్షీర, గృతాలను వాడాలన్నారు. పంచకర్మ చికిత్సలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడానికి కొద్దిపాటి వ్యాయామం, సులభమైన ఆసనాలు, యోగ, ప్రాణాయామం, ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు మిడతల చంద్రమౌళి, విఠల్ రుక్మిణీ విజయ వృద్ధ అనాధాశ్రమ వ్యవస్థాపకులు డి.ఎర్రిస్వామి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కె.క్రిష్టప్ప, కార్యదర్శి ఎన్.వెంకటస్వామి, ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది మహేష్, ఓబులేసు, మాజీ వార్డు సభ్యుడు సుద్దల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# శెట్టూరు మండలం చింతర్లపల్లిలో విరభూసిన విద్యా కుసుమం బడిగె ఉమేష్

## - హైదరాబాద్ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవంలో గోల్డ్‌మెడల్ అందుకున్న డా.బడిగె ఉమేష్



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో గోల్డ్ మెడల్ అందుకుంటున్న డాక్టర్ బడిగే ఉమేష్

**శెట్టూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం శెట్టూరు మండలం, చింతర్లపల్లి గ్రామానికి అనంతపురం రత్నమ్మ, బడిగె హనుమంతప్ప (కార్పెంటర్) కుమారుడు బడిగె ఉమేష్. వీరు హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జీవితం, రచనలు, సమగ్ర పరిశీలన అనే అంశంపై ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 2019లో పిహెచ్‌డి పూర్తి చేశారు. విశ్వవిద్యాలయ 22వ స్నాతకోత్సవంలో ఈసిద్ధాంతం గ్రంథం డా.కామేశ్వరి దేవి మెమోరియల్ మెడల్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా బడిగె ఉమేష్ డాక్టరేట్ పట్టాను హైదరాబాద్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ జస్టిస్ నరసింహారెడ్డి చేతులుమీదుగా అందుకోగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్‌తో డా.కామేశ్వరిదేవి మెమోరియల్ మెడల్ (గోల్డ్‌మెడ్)ను స్వీకరించారు. పరిశోధకుడు డా.బడిగె రమేష్ ఇప్పటి వరకు ఒక అంతర్జాతీయ సదస్సు, ఎనిమిది జాతీయ సదస్సుల్లో తమ పరిశోధన పత్రాలను ఆయా అంశాలపై సమర్పించారు. ఈయన రాసిన వ్యాసాలు ఆంధ్రజ్యోతి, సాక్షి, ఆంధ్రప్రభ, ప్రజాశక్తి, ఆంధ్రభూమి, భూమిపుత్ర దిటైమ్స్ టుడే సృజన నేడు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అలాగే మాస పత్రికలైన రాయలసీమ జాగృతి, పాలపిట్ట, భావవిణ, సంశోధన, మూసి, అమ్మనుడి ఆలోకూడా కొన్ని వ్యాసాలు అచ్చయ్యాయి. కొన్ని ప్రత్యేక గ్రంథాల్లో కూడా వచ్చాయి. ఉమేష్ సుమారు 30కిపైగా వ్యాసారాలు రాయడం విశేషం.ప్రస్తుతం వీరు కేంద్ర ప్రభుత్వంలో భాగమైన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరులో అసోసియేట్ ఫెలోగా విధులు నిర్వహిస్తున్నారు. డా.బడిగె ఉమేష్ ఈ చైతన్యంతోనే తెలుగు సాహిత్యంలో ఇంకా వెలుగు చూడని అంశాలపై పరిశోధన చేయాలని, తమ భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలని, వీలైనంతలో నలుగురికి సహాయం చేయాలని ఆకాంక్షించారు.

# పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం



కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

**పుట్టపర్తిరూరల్, అక్టోబర్ 01, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయం నందు ఎపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల కొందండరామిరెడ్డి రాయలసీమ రీజినల్ ప్రభుత్వ డాక్టర్ల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మినాయక్‌లు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి సమస్యలు వివరిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు ప్రకటిస్తూ శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఒకే ప్రాంగణంలో 18 ప్రభుత్వ శాఖల కార్యాలయాలు పుట్టపర్తిలో ఇరుకుగా 80 గదులలోఉండడం, ప్రభుత్వ ఉద్యోగస్తులకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి రాష్ట్ర ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని, పుట్టపర్తికి ఇతర ప్రాంతాల నుండి రవాణ సౌకర్యం కల్పించాలని, వెనుకబడిన ప్రాంతమైన మడకశిర బస్ డిపోను రద్దు చేయరాదని, వైద్య ఆరోగ్య ఉద్యోగస్తుల సమస్యలపై పుట్పటర్తి శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీదర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. దీనిపై ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి మరియు ఆరోగ్య శాఖ ప్రిన్సిపుల్ సెక్రెటరీ దృష్టికి సమస్య తీసుకెళ్ళి పరిష్కారం కోరుతామని ఆయన తెలియజేశారు.

# కొర్ర పంట కోత ప్రయోగాలు.. పంట అంతంత మాత్రమే..!



కొర్ర ధాన్యమును తూకం వేస్తున్న అధికారులు

**కనగానపల్లి, అక్టోబర్ 1 ప్రభాతవార్త**

మండల పరిధిలోని మద్దెల చెరువు గ్రామంలో శనివారం రైతు ముత్యాలప్ప పొలంలో సర్వే నెంబర్ 790/1లో కొర్ర యుఐ పంట రకాన్ని వర్షాధారం కింద పంటను సాగు చేశారు. అధికారులు పంట కోత ప్రయోగాలు చేయగా 0.350 కెజిలు మాత్రమే దిగుబడి వచ్చిందని అధికారులు అంచనా వేశారు. ఆగస్టులో తీవ్ర వర్షాభావం ఏర్పడడంతోపంట దెబ్బదినిందని అధికారులు అంచనా వేశారు. అధికారులు స్పందించి పంట నష్ట పరిహారం వచ్చేలా చూడాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆదినారాయణ, ఏఎన్ఓ రాజకుమారి, ఎంపిటిసి పూజారి చిన్న చెరువన్న, విఏఏలు శివప్ప, లక్ష్మినారాయణ, రైతులు పాల్గొన్నారు.

## కళాశాల నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 1, ప్రభాతవార్త

కేజీబివి జూనియర్ కళాశాల నిర్మాణానికి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. కదిరి–హిందూపురం ప్రధాన రహదారి పక్కన యం కొత్తపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 236లో 0.29 సెంట్ల స్థలంలో జూనియర్ కాలేజి నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. కాలేజి నిర్మాణంతో కేజీబివిలో ఇంటర్ వరకు విద్యను కొనసాగించేందుకు విద్యార్థినిలకు కొనసాగించేందుకు అనుకూలంగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తుమ్మల పర్వీన్‌భాను, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, సర్పంచ్ రంగారెడ్డి, తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఓ పోలప్ప, కేజీబివి ఎస్ఓ షాహీన్, వైస్ ఎంపిపి మల్లూరి లక్ష్మిదేవి, కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, అగ్రిబోర్డు చైర్మెన్ లక్ష్మిరెడ్డి, మైనార్టీ నాయకులు తుమ్మల షామీర్‌బాషా, వైసిపి నాయకులు మద్దే రాజునాయుడు, చెన్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం ఇస్తున్న ఉచిత పథకాలకు రాజకీయ రంగు పులుముతున్న వైసిపి

-వైసిపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజాపోరు బాటలో ఎండగట్టాం: సత్యసాయి జిల్లా బిజెపి అధ్యక్షుడు వజ్ర


మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు వజ్ర

కదిరి, అక్టోబర్ 1, ప్రభాతవార్త

దేశ ప్రధాని నరేంద్రమోది రాష్ట్రానికి అందిస్తున్న ఉచిత పథకాలకు అధికార పార్టీ ప్రభుత్వం రాజకీయ రంగు పులిమి రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని సత్యసాయి జిల్లా బిజెపి అధ్యక్షులు వజ్ర భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బిజెపి కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో వజ్ర భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి తీవ్ర నిరోధక ప్రభుత్వంగా పేరుగడించిందన్నారు. మూడున్నర సంవత్సరాల వారిపాలనలో చేసిన అభివృద్ధి ఎండమావిగా తమ ప్రజల కళ్లకు కనబడుతోందన్నారు. పాదయాత్ర సమయంలో మద్యపాన నిషేదం అమలు చేస్తామన్న పెద్దమనిషి ఆ మద్యం వ్యాపారంతోనే కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి నేడు ప్రేక్షక పాత్ర వహించడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం లక్షాది గృహాలను నిరుపేదలకు మంజూరు చేస్తే వందల సంఖ్యలో కూడా ఎక్కడ నిర్మాణాలు పూర్తికాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందన్నారు. ముస్లిం మైనార్టీ వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుల్హన్ పథకానికి 10వ తరగతి ఉత్తీర్ణత అనే నియమ నిబంధన పెట్టడం ఈ పథకానికి పరోక్షంగా మైనార్టీ వర్గానికి కోత విదించడమేనన్నారు. ఇందువల్ల 95 శాతం ఈ పథకానికి ఆ వర్గం దూరం కావడానికి అవకాశం మెండుగా ఉందన్నారు. మసీదు మరమ్మత్తులకు కేంద్రం నిధులు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విడుదల చేయలేదో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. విదేశీ విద్యాపథకాన్ని ఈ ప్రభుత్వం తుంగలో తొక్కి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తూట్లు పొడిచిందన్నారు. కదిరిలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్న సంగతి ప్రజలు గమనించాలన్నారు. కోనేరు నిర్మాణానికి రూ 2 కోట్ల నిధులు వెచ్చించి నిర్మాణం చేపట్టిన ఆ నిధులు దుర్వినియోగం అయ్యాయే తప్ప భక్తుల పుణ్యాస్నానాలకు అందుబాటులోకి రాలేదన్నారు. బిజెపి ఆధ్వర్యంలో తలపెట్టిన పోరుబాటలో సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 325 ప్రజాపోరు బాట కార్యక్రమాలను ఆయా నియోజకవర్గాల్లో పర్యటించి ఈ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజలకు వివరించి చైతన్యం కల్పించామన్నారు. ఈ పోరుబాటలో అధికశాతం ప్రజలు డ్రైనేజి కాలువలు, తాగునీటిసమస్యలతో పాటు ఇంటి నివేశస్థలాలపై తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ సమస్యలను హితోదికంగా ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తాను తీసుకుపోవడం జరిగిందన్నారు. సత్యసాయి జిల్లాలో అర్హులైన నిరుపేదలు ఏదైనా విపత్కర సమస్య తలెత్తితే తన ఇంటి తలుపులు ఏ క్షణమైనా తట్టవచ్చునని వజ్ర భాస్కర్‌రెడ్డి పిలుపు నిచ్చారు.

## ఫర్టిలైజర్స్ షాపు తనిఖీ

తనకల్లు, అక్టోబర్ 1 ప్రభాతవార్త


రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్‌లోని వెంకట నారాయణ శెట్టి ఫెర్టిలైజర్స్, చిన్నపరెడ్డి ఫెర్టిలైజర్స్, లక్ష్మి వేంకటేశ్వర ఫెర్టిలైజర్స్, కోరమండల్ ఫెర్టిలైజర్స్ షాపులను తనిఖీ అధికారి, సహాయ వ్యవసాయ సంచాలకులు ధర్మవరం ఎడిఎ కృష్ణయ్య మండల వ్యవసాయ అధికారి హరినాయక్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఇలా రైతు ఏది కొనుగోలు చేసినా తదితర వివరాలన్నీ ఇపిఓఎస్ ద్వారా జరపాలని సూచించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు అమ్మరాదని హెచ్చరించారు. కొక్కంటి క్రాస్‌లోని లక్ష్మి వేంకటేశ్వర ఫెర్టిలైజర్స్‌లో ప్రిన్సిపాల్ సర్టిఫికెట్స్ ఓ ఫార్మ్ లేని కారణంగా 44.175 టన్నులు రూ.10,14,426ల విలువ గల ఎరువులను స్టాక్‌ను తదుపరి అమ్మకాలు జరపకుండా, స్టాప్ సేల్ ఆర్డర్ ఇవ్వడం జరిగింది. వెంకటనారాయణ ఫెర్టిలైజర్స్‌లో ప్రిన్సిపుల్ సర్టిఫికెట్స్ ఓ ఫార్మ్ లేని కారణంగా 14.605 టన్నుల రూ.3,07,934 విలువగల ఎరువలను స్టాక్‌ను తదుపరి అమ్మకాలు జరపకుండా స్టాప్ సేల్ ఆర్డర్ ఇవ్వడం జరిగింది. ఇలా స్టాప్ పేల్ ఆర్డర్ ఇచ్చిన వాటికి సంబంధించిన ప్రిన్సిపుల్ సర్టిఫికెట్స్ పొందిన తర్వాత ఆయా ఎరువుల అమ్మకాలు జరుపుకోవడానికి అనుమతి ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏడిఏ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీహరినాయక్, ఏఈఓ నయాజ్, ఆయా షాపుల డీలర్లు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి

యల్లనూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త

మండలంలోని చిత్రావతి ఉదృతంగా ప్రవహిస్తోంది. నదీ పరివాహక ప్రాంతాల వారు అప్రమత్తంగా వుండాలని తహశీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ శనివారం పార్నపల్లి డ్యాం నుండి చిత్రావతి నదిలోకి 3 గేట్ల ద్వారా 3500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారన్నారు. కావునా పిల్లలు, పెద్దలు, పశువులు నది చుట్టుపక్కలకు వెళ్లకుండా జాగ్రత్తగా వుండాలని తహశీల్దార్ తెలియచేశారు.

## నేడు వడ్డెర్ల ఆత్మీయసభ

అమడగూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త

వడ్డెర సంఘం ఆత్మీయసభను విజయవంతం చేయాలని వడ్డెర సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టపర్తిలోని జానకిరామయ్య కళ్యాణమండపంలో ఆదివారం జరిగే వడ్డెర సంఘం ఆత్మీయసభకు హాజరై విజయవంతం చేయాలని వడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెరిపిటి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు.

## వైసిపి నుంచి టిడిపిలోకి చేరిన 10 కుటుంబాలు

ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 1, ప్రభాతవార్త


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కన్వీనర్

మండల పరిధిలోని కొండకమర్ల గ్రామానికి చెందిన 10 కుటుంబాలు శనివారం వైసిపి నుంచి టిడిపిలోకి చేరారు. వీరిని మండల టిడిపి కన్వీనర్ జయచంద్ర, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజినేయులు, పార్లమెంటు రైతు సంఘం జాకీర్‌ల ఆధ్వర్యంలో వీరికి టిడిపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పీట్ల సుధాకర్, మండోజి ఆరీఫ్‌ఖాన్, సాదీ నాగరాజు, గంగాద్రి, శంకరయ్య, ఇర్షాద్, అబ్లూ పాల్గొన్నారు.

## పీఠాధిపతిని సన్మానించిన ఈఓ, చైర్మెన్

కదిరి టౌన్, అక్టోబర్ 1, ప్రభాతవార్త


పీఠాధిపతిని సన్మానించిన ఈఓ, చైర్మెన్

ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శ్రీమత్ ఖాద్రీ నరసింహస్వామి దర్శనార్థం శనివారం ఇచ్ఛాపురం నమిశారణ్యం పీఠాధిపతి బాలాబ్రహ్మానంద సరస్వతి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతికి ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ పాలక మండలి చైర్మెన్ జెరిపిటి గోపాలక్రిష్ణ, ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, పార్థసారధిఆచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీవారికి అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజులు నిర్వహించి స్వామి వారి చిత్రపటాన్ని శేషవస్త్రా లతో సత్కరించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందచేశారు.

## ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలోకి చేరిక

ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 1, ప్రభాతవార్త


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

మండల పరిధిలోని కొండకమర్ల గ్రామానికి చెందిన 50 కుటుంబాలు శనివారంపుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే దుద్దుకుంట చేస్తున్న నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసిపిలోకి చేరడం జరిగిందన్నారు. పార్టీ బలోపేతానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ శ్రావణి, సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి, అగ్రి బోర్డు చైర్మెన్ లక్ష్మిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్‌చౌదరి, కో ఆప్షన్ నిస్సార్, వైసిపి నాయకులు వెంకటనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

## టీబీ రహిత భారత్ అభియాన్....


టీబీ రహిత భారత్ అభియాన్‌కు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్

బళ్లారి, అక్టోబర్01, ప్రభాతవార్త

2030 నాటికి టీబీ రహిత భారత్‌గా ఉండాలన్న అభియాన్‌కు స్పందించిన ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్ నగరంలోని పది మంది క్షయ రోగుల్ని ఒక సంవత్సరంపాటు దత్తత స్వీకరించారు. ప్రధానమోదీ 'మన్‌కీ బాత్'లో టీబీ రహిత భారత్ అంశాన్ని ప్రస్తావిస్తూ దాతలు, కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జీఓలు, ప్రజాప్రతినిధులు, సంఘసంస్థలు క్షయరోగుల్ని దత్తత పొంది వారికి చికిత్స కల్పించి ఆరోగ్యవంతులుగా చేయాలని, దీనికి అందరూ స్పందించాలని పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సతీష్ తాను దత్తత పది మంది క్షయ రోగుల్ని నగరంలోని రాణితోటలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సందర్శించి టీబీతో బాధపడుతున్న వారు సకాలంలో తగు చికిత్స పొందితే వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చునని, రోగులు పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో దత్తత స్వీకరించిన రోగులు ప్రభుత్వం అందజేస్తున్న ఔషధాలను సక్రమంగా తీసుకుంటున్నట్లు, ఉత్తమ చికిత్స అందిస్తున్నారని, దేశాన్ని క్షయరహిత భారతదేశంగా మనమంతా తీర్చిదిద్దేందుకు మనమంతా కట్టుబడి ఉండాలని, దాతలు అందజేసే పౌష్టికాహారాన్ని సేవించి, త్వరగా కోలుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా క్షయ నిర్మూలనాధికారి డా.ఇంద్రాణి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షానికి నేలకొరిగిన వరి పంట

- సిరుగుప్ప తాలుకా రైతాంగం ఆందోళన


సిరుగుప్ప తాలుకాలో నేలకొరిగిన వరి పంట

బళ్లారి, అక్టోబర్01, ప్రభాతవార్త

గత రెండు, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జిల్లాలో రైతులు వేసుకున్న వరి పంటకు హానీ జరిగింది. జిల్లాలోని సిరుగుప్ప తాలుకా తుంగభద్ర నది పరివాహక ప్రాంతంలో గల ఎం.సూగూరు, నడివి, రుద్రపాద, బళ్లారి తాలుకాలో మోకా, ఎర్రగుడి, చాగనూరు, సిరివార గ్రామాల్లో వరి పంట వరుసగా కురుస్తున్న వర్షానికి నేలకొరిగినట్లు, ఇలాగే కొనసాగితే మిగతా రైతులు సాగు చేస్తున్న పంటలు సైతం చేతికి రాకుండా పోతాయని, ఈసారి కూడా తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారులు తక్షణమే పరిశీలన జరిపి నష్టానికి గురైన వరి రైతులకు తగు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## బిసి హాస్టల్‌లో పర్యటించిన నాడు-నేడు ఏఈ

నల్లచెరువు, అక్టోబర్ 01, ప్రభాతవార్త


బిసి హాస్టల్‌లో చర్చిస్తున్న ఏఈ ప్రకాష్

మండల కేంద్రంలోని బిసి హాస్టల్ నందు నాడు- నేడు క్రింద పనులపై ఏఈ ప్రకాష్ శనివారం పర్యటించారు. హాస్టల్ వసతులపై హాస్టల్ వార్డెన్ లక్ష్మీ నారాయణ ప్రపోజల్ ఇవ్వగా ఏఈ మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు క్రింద ప్రవేశపెట్టిన పథకంపై విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా హాస్టల్ వసతులపై నూతన హంగులతో రూపురేఖలు మార్చుతామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు మరుగుదొడ్లు, బట్టల వాషింగ్ రూములు, స్టడీ హావర్స్‌పై స్టైల్స్, హాస్టల్ గోడలకు పెయింటింగ్ మెరుగైన రంగులతో పనులు చేపడతామని హాస్టల్ వార్డెన్, ఏబిడబ్ల్యు గంగాధర్ తెలిపారు.

## మున్సిపల్‌చైర్మన్ జె.సి నిరసన దీక్ష

నిరసనదీక్షలో పాల్గొన్న జె.సి




తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త

పట్టణంలోని పోలీసుస్టేషన్ సమీపంలో మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి శనివారం నల్లదుస్తులు ధరించి నిరసనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జె.సి మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలోని విలువైన స్థలాలను కాపాడాలన్న ఉద్దేశ్యంతోనే ఈ నిరసన దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవుతున్న తరుణంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు సంప్రదించగా ట్రాఫిక్‌పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరగా పట్టణపోలీసుస్టేషన్ పక్కన వున్న ఖాళీ స్థలంలో ట్రాఫిక్‌పోలీసుస్టేషన్ నిర్మాణం కోసం అనుమతించాడన్న విషయాన్ని తెలుసుకున్న జె.సి సేవ్ తాడిపత్రి అనే నినాదంతో విలువైన ఆస్తులను కాపాడడమే తన ధ్యేయమన్నారు. ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు కావాల్సి వస్తే ఇదివరకే నిర్మించబడిన భవనాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. అలాగే టిడిపి కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో కాళికాదేవి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త



పట్టణంలోని వడ్లపాలెంలో వెలసిన శ్రీకాళికాదేవి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలల్లో భాగంగా ఉదయం అమ్మవారికి అర్చకులు వీరబ్రహ్మంఆచార్యులు అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న శ్రీఅష్టలక్ష్మిదేవి అలంకారం..** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు శనివారం శ్రీఅష్టలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రనాథ్, బచ్చు సుబ్రమణ్యం, జయవరం అశ్వర్థరంగయ్య, భూమా సుబ్రమణ్యం, వంకదార చిన్నమద్దులేటి (రాజ), సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీచండికాదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి

యాడికి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని అమ్మవారిశాలలో శ్రీకన్యకాపరమేశ్వరి శనివారం శ్రీచండికాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని శ్రీచండికాదేవిగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం హాజరైన వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

**శ్రీఅన్నపూర్ణదేవి అలంకరణలో పెద్దమ్మతల్లి...** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో వెలసిన పెద్దమ్మతల్లి శనివారం శ్రీఅన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు, మహామంగళహారతి, నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## డ్రిప్ పరికరాలను పరిశీలించిన పిడి

పుట్లూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త


డ్రిప్పులను పరిశీలిస్తున్న పిడి

మండలంలోని కడవకల్లు గ్రామంలో ప్రభుత్వ రాయితీపై ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పరికరాలను శనివారం ఎపిఎంఐపి పిడి ఫిరోజ్‌ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని సాధించడం కేవలం డ్రిప్ వల్లనే సాధ్యమవుతుందన్నారు. క్షేత్రస్థాయిలో డ్రిప్ పరికరాల పనితీరు, రైతులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్రిప్ పరికరాలను సదరు కంపెనీ దారులు సకాలంలో రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 5 ఎకరాలలోపు వున్న వారందరికి 90 శాతం సబ్సిడీని 5 ఎకరాలుపైన వున్న రైతులకు 70 శాతం సబ్సిడీ వర్తిసుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఐ దిలీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి సెంటర్‌ను తనిఖీ చేసిన సిడిపిఒ

యాడికి, అక్టోబర్ 1 ప్రభాతవార్త


సెంటర్‌ను పరిశీలిస్తున్న సిడిపిఒ సజిదాబేగం

పట్టణంలోని నెంబర్-9 అంగన్‌వాడి సెంబర్‌ను శనివారం సిడిపిఒ సజిదా బేగం తనిఖీ చేశారు. రెండు రోజులుగా అంగన్ వాడి సెంటర్ ద్వారా పిల్లలు, తల్లులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంలో కుళ్లిన గుడ్లు, గడువు ముగిసిన ఆహారపదార్థాలను చేసిన వాటిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సిడిపిఒ సంబంధిత అంగన్‌వాడి సెంటర్‌ను తనిఖీ చేసి ఆహార పదార్థాలను పరిశీలించారు. బఫర్‌స్టాక్, ముగిసిన తేదీ పదార్థాలను వెనక్కు పంపాలని ఆదేశించారు. ముఖ్యంగా దిగుమతి చేసే సమయంలో చూసుకోవాల్సిన బాధ్యత వుందని, దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అంగన్‌వాడిటీచర్‌కు షోకాజునోటీసు ఇచ్చినట్లు సిడిపిఒ తెలిపారు. సిడిపిఒ వెంట సూపర్‌వైజర్ హుసేనమ్మ వున్నారు.

## శ్రీ వెంకటేశ్వరస్వామి అలంకరణలో అమ్మవారు

నల్లచెరువు, అక్టోబర్ 01, ప్రభాతవార్త

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శని వారం నల్లచెరువు మండలంలోని ఆర్య వైశ్యులు శ్రీ వాసవీ కన్యకాపర మేశ్వరీ అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలు, వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శన మిచారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారి దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ పూజా కార్యక్రమానికి దిండుకీర్తి హరీష్, లక్ష్మీపతిలు ఉభయ దారులుగా వ్యవహరించారు.





## ఎస్‌సి కమిషన్ చైర్మన్‌ను కలిసిన మల్లికార్జున

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త


మారుమూడి విక్టర్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్‌ను తాడిపత్రి మున్సిపల్ 30వవార్డు కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై మోపిన అక్రమ కేసుల గురించి ఆయనకు వివరించారు.

## ఫించన్ల పంపిణీని పరిశీలించిన హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త


వృద్ధురాలితో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

పట్టణంలోని రెడ్డివారిపాలెంలో శనివారం జరిగిన ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. అదేవిధంగా ఆయన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. చిన్న సమస్య వున్న జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఉన్నంతవరకు ఎవరికి అన్యాయం జరగదన్నారు. వ్యతిరేకపక్షంలో వున్న , ప్రతిపక్షంలో వున్న ఎవరికి కూడా అన్యాయం జరగనివ్వమని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఆయన తాడిపత్రి నియోజకవర్గం ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియచేశారు.

## ఇళ్లలో విలువైన వస్తువులు ఉంచుకోకండి

పుట్లూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త


ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

దొంగతనాల నివారణకు ప్రతిఒక్కరు పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలని ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి మండల ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో విలువైన ఆభరణాలు, భారీగా నగదు బీరువాల్లో వుంచి వాటి తాళాలు బీరువాపైభాగాల్లో పెట్టడం మంచిదికాదన్నారు. ఆభరణాలు, నగదు బ్యాంకు లాకర్లలో వుంచుకోవాలన్నారు. ప్రజలు వేరే ఊర్లకు వెళ్లేటప్పుడు పోలీసులకుగానీ, ఇంటి చుట్టుపక్కల నమ్మకమైన వారికి తెలియచేయాలన్నారు. అంతేకాకుండా ఇంటికి నాశిరకం తాళాలు వాడరాదన్నారు. ఇంటికి సొంతంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు జరగకుండా చూసుకోవచ్చని ఆయన తెలిపారు.

## 3లోగా ఈకెవైసి చేయించుకోవాలి

పుట్లూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త

ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి ఈక్రాప్ బుకింగ్ చేయించుకున్న


ఈకెవైసి చేస్తున్న దృశ్యం

రైతులు ఈ నెల 3లోగా ఈకెవైసి చేయించుకోవాలని వ్యవసాయాధికారి కాత్యాయిని తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 8366 మంది రైతులు 29421 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, సోయాబీన్స్, ఉద్యానపంటలు సాగుచేశారని కావునా రైతులు ఆర్‌బికె సిబ్బందితో ఈకెవైసి చేయించుకోవాలన్నారు. ఈకెవైసి చేయించుకోని రైతులకు ఇన్సూరెన్స్, సున్నావడ్డీ ప్రభుత్వం అందించే పథకాలు అందవన్నారు. కావునా రైతులు ఖచ్చితంగా ఈకెవైసి చేయించుకోవాలని ఎఒ తెలిపారు.

## 80 ఏళ్లు దాటిన ఓటర్లకు సన్మానం

తాడిపత్రిరూరల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త


సీనియర్ ఓటర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎన్నికల కమీషన్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు 151 తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గంలోని 80 సంవత్సరాలు దాటిన ఓటర్లను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు, ఎన్నికల డిప్యూటి తహశీల్దార్, ఎన్నికల సీనియర్ సహాయకులు, కార్యాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

## రక్తదానానికి విశేష స్పందన

యాడికి, అక్టోబర్ 1 ప్రభాతవార్త


రక్తదానం చేస్తున్న దృశ్యం

పట్టణంలోని స్వచ్ఛంధ సంస్థ మే ఐ హెల్ప్ యు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక శ్రీలక్ష్మీచెన్న కేశవ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో దాదాపు 85 మంది స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. మే ఐ హెల్ప్ యు సంస్థ మండలంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతోంది. రక్తదానం చేసిన వారికి సంస్థ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు బండారు బాలకృష్ణ, సభ్యులు ఆలూరు చంద్రశేఖర్‌రెడ్డి, ధృవనారాయణ, నరసింహ, రామాంజినేయులు, విశ్వనాథ్, బడిగించల వేణు, నరేష్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపిడిఒ

పుట్లూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మండలంలోని అర్కటివేముల గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ యోగానందరెడ్డి శని వారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆన్‌లైన్ బయో మెట్రిక్, హాజరు పట్టిక, మూమెంట్ రిజిష్టర్లు పరిశీలించారు. సచివాలయం సేవలు ప్రజలు వినియోగించుకునేలా చూడాలని, తమ పరిధిలో వున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపిడిఒ సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త

2021-22 విద్యా సంవత్సరానికిగాను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం మైనార్టీ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ కం మీన్స్, బేగం హజరత్‌మహల్ నేషనల్ స్కాలర్‌షిప్ ఉపకార వేతన పథకంకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

